జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

హైదరాబాద్ సిటి సివిల్ కోర్టులో 669 కేసుల పరిష్కారం


బాధితులకు చెక్కును అందజేస్తున్న సిటి సివిల్ కోర్టు చీఫ్ జస్టిస్ రేణుకా యారా, పంచాక్షరి

యాకుత్‌పురా: పురాణిహవేలీలోని సిటి సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ అనూహ్య స్పందన వచ్చింది. హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు చీఫ్ జస్టిస్, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకా యారా ఆధ్వర్యంలో 4 బెంచీలను ఏర్పాటు చేసి 669 కేసులను పరిష్కారించి బాధితులకు రూ. 37,32,02,503ల నష్టపరిహారాన్ని అందించారు. అదేవిధంగా మోటారు వాహన ప్రమాద కేసును పరిష్కరించి శ్రీరామ జనరల్ బీమా కంపెనీ వారు అందించిన రూ. 1,18,50,000 ల నష్టపరిహారం చెక్కును రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళార్చన, బీమా ప్రతినిధులతో కలిసి చీఫ్ జస్టిస్ రేణుకా యారా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. రెండో అదనపు చీఫ్ జస్టిస్ వై. పద్మ, 24వ అదనపు చీఫ్ జడ్జి జీ ఉదయ్ కుమార్, జడ్జిలు వీ ఈశ్వరయ్య, కే సాయి కిరణ్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఓ ఆడిటోరియంలో క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్ చేస్తున్న డీఆర్‌డీఎల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ రాజాసింగ్

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఓ న్యూ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఆర్‌డీఓ ల్యాబ్స్ క్రిస్టియన్ ఫెలోషిఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఆర్‌డీఎల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ డీ రాజా సింగ్ ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ప్రకాశ్ గంటిల క్రిస్మస్ సందేశాన్ని అందించారు. డీఆర్‌డీఓ ల్యాబ్స్ క్రిస్టియన్ ఫెలోషిఫ్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ టీపీ భాస్కర్, వైస్ చైర్మన్ సీహెచ్.అనిల్, కార్యదర్శి టీ శివ పాల్గొన్నారు.

21న పురస్కారాల ప్రదానం


సుద్దాల అశోక్ తేజ


వెంకట రాయుడు

సుల్తాన్‌బజార్: ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజకు డాక్టర్ కేవి.వరప్రసాద్‌రెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారాన్ని మనసు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ మన్నం వెంకట్‌రాయుడుకు కోదూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు శాంత వసంత ట్రస్ట్ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నెల 21న సాయంత్రం 6 గంటలకు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఉంటుంది. ఒక్కొక్కరికి రూ. లక్ష నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించనున్నట్లు ట్రస్ట్ పేర్కొంది.

జీఎన్‌ఐటీఎస్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం


కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది, విద్యార్థులు

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జీ నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, ఇంటిగ్రేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఎమోషన్ ఇంటిలిజెన్స్ తదితర అంశాలపై శనివారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. చెన్నైకి చెందిన ఆర్‌ఎస్‌పీ రీసెర్చ్ హబ్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమాన్ని జీఎన్ఐటీఎస్ అకాడమిక్ డీన్ డాక్టర్ కే రామలింగారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యం పెరుగుతుందని తమ కళాశాలలో ఈ రంగంలో అపార అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నారన్నారు. ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ వల్ల విద్యార్థుల్లో సాంకేతిక విషయాలపై పట్టు పెరగడమే కాకుండా విషయ పరిజ్ఞానంలో వారికి మంచి అనుభవం సిద్ధిస్తుందని అన్నారు. ఎమోషనల్ ఇంటిలిజెన్స్ కూడా ఈ రంగంలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి జయలక్ష్మి, కోఆర్డినేటర్ డాక్టర్ వీ విజయలక్ష్మి, డాక్టర్ బీ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



ఆత్మహత్యాయత్నానికి యత్నించిన వ్యక్తి అరెస్ట్



డబీర్‌పురా: సినీ హీరో అల్లు అర్జున్ అరెస్ట్‌కు నిరసనగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అభిమానిని డబీర్‌పురా పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుష్పా–2 సినిమా విడుదల సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటన విషయమై అల్లు అర్జున్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి చంచల్‌గూడ తరలిస్తుండగా.. బాలాపూర్ జనప్రియ అపార్ట్‌మెంట్ ఆరో బ్లాక్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ముదావత్ రాజు (31) శుక్రవారం రాత్రి జైలు ఎదుట డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న డబీర్‌పురా పోలీసులు రాజును అదుపులోకి తీసుకున్నారు.

కలుషిత నీటి సరఫరాను నివారించాలి

అఫ్జల్‌గంజ్: బేగంబజార్ పరిధిలోని చుడిబజార్ పరిసర ప్రాంతాల్లో కలుషిత నీటి సరఫరాను నివారించాలని ఆ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి కే ప్రదీప్‌రాజ్ కోరారు. ఈమేరకు వాటర్‌బోర్డు అధికారి శ్రీనివాస్‌కు గోడేకబర్ వాటర్‌బోర్డు మేనేజర్ ఖాదర్‌కు శనివారం మెమోరాండం అందజేశారు. అనంతరం ప్రదీప్‌రాజ్ మాట్లాడుతూ.. కలుషిత నీటి సరఫరా నివారించకుంటే వాటర్ బోర్డు ఎండీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్తీక్, టంపు తదితరులు పాల్గొన్నారు.


మెమోరాండం అందజేస్తున్న ప్రదీప్‌రాజ్ తదితరులు

ప్రార్థనా మందిరాలు పవిత్ర స్థలాలు


మసీదు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రార్థనా మందిరాలు పవిత్ర స్థలాలు అని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. షేక్‌పేట్ డివిజన్ డైమండ్ హిల్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన మజీద్ ఏ పాషాను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మసీదు నిర్మించిన గులామ్ మొహియుద్దీన్ ఖాన్‌ను అభినందించారు. కార్యక్రమంలో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్, మజ్లిస్ నాయకులు షకీల్ ఆలీఖాన్, అరూస్‌ఫరాన్ ఉన్నారు.

విద్యాసంస్థల్లో కామన్ డైట్ షురూ

- సాంఘిక సంక్షేమ, గురుకులాల్లో అమలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు


గోల్కొండ బాలికల ప్రభుత్వ మైనార్టీ వసతి గృహంలో వంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్


గుడిమల్కాపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

గోల్కొండ: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. వసతి గృహాల విద్యార్థులకు ప్రభుత్వం చార్జీలు పెంచడంతో శనివారం నుంచి హాస్టల్స్‌లో కొత్త డైట్ మెనూ అమల్లోకి వచ్చింది. గోల్కొండ మైనార్టీ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు కిచెన్‌ను పరిశీలించి వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త డైట్ సక్రమంగా విద్యార్థులకు అందించే బాధ్యత వార్డెన్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్‌పై సైతం ఉంటుందన్నారు. మూడేళ్లుగా మైనార్టీ పాఠశాల విద్యార్థినులు చదువులో అత్యుత్తమంగా రాణిస్తున్నారని కొత్త డైట్‌తో వారు సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలనిఆ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట విద్యార్థినులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

విద్యార్థుల శారీరక ఎదుగుదలకు కామన్ డైట్ మెనూ ఎంతగానో దోహదపడుతుందని హైదరాబాద్ స్పెషల్ ఆఫీసర్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి అన్నారు. గుడిమల్కాపూర్ కార్వాన్‌లోని ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలుర వసతి గృహంలో కొత్త డైట్ మెనూన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైట్‌లో బగారా రైస్, చికెన్, పెరుగు, సాంబార్‌ను చేర్చారని, దీన్ని వల్ల విద్యార్థులకు ప్రొటీన్స్‌తో పాటు అన్ని రకాల పోషకపదార్థాలు అందుతాయమన్నారు. కార్యక్రమంలో హాస్టల్ ప్రతినిధి అనిల్, వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, వెంకట్ తదితరులు ఉన్నారు.

నేటి గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నాంపల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేటి నుంచి నిర్వహిస్తున్న గ్రూప్–2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జేఎన్టీయూ, పాలిటెక్నిక్, బాబు జగ్జీవన్‌రామ్ బాలుర డిగ్రీ, ఇందిరాప్రియదర్శిని మహిళా డిగ్రీ , ఎంఏఎం జూనియర్, అన్వర్ ఉలూం కళాశాలలు, తదితర ప్రాంతాల్లో రెండు రోజుల పాటు పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్ష ప్రారంభ నుంచి పూర్తయ్యే వరకు ఆయా కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. సమీప ప్రాంతాల్లోని జిరాక్స్, కంప్యూటర్ సెంటర్లను ముందస్తుగా మూసివేస్తారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

అలరించిన ఆరాధన సంగీత మహోత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న కట్ట నాగేందర్, సత్యప్రకాశ్

అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా త్రయంబకేశ్వర ఆలయంలో శనివారం నిర్వహించిన రాజశ్రీ తూము లక్ష్మీ నర్సింహాదాసు ఆరాధన సంగీత మహోత్సవాలు అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు కట్టా నాగేందర్, సంయుక్త కార్యదర్శి సత్యప్రకాశ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

సెంటాన్స్‌లో 'గణిత్ మహోత్సవ్-2024'


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గోల్కొండ: గణిత మేధావి శ్రీనివాస రామానుజం జయంతిని పురస్కరించుకుని మెహిదీపట్నం సంతోష్ నగర్‌లోని సెంటాన్స్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం 'గణిత్ మహోత్సవ్-2024' నిర్వహించారు. మహేంద్ర యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహిపాల్‌జట్టా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థినులకు గణిత పోటీలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధిలో గణిత శాస్త్రానిది కీలక పాత్ర అన్నారు. చిన్నప్పటి నుంచే గణితంలో ఆసక్తి కనబరిచే వారు గణిత శాస్త్రంలో అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.అనంతలక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఏ.విజయరాణి, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

అత్తాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కొండకళ్ల నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులకు అందేలా పాటుపడతానన్నారు. అంతేగాకుండా యువజన కాంగ్రెస్‌ను రంగారెడ్డి జిల్లాలో మరింత బలోపేతం చేస్తానన్నారు. అందరిని కలుపుకుంటూ ముందుకుసాగుతూ పార్టీ ఇచ్చే ప్రతి పిలుపును విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మహిపాల్‌యాదవ్, రాజన్, శ్రీహరిగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ముష్రాఫ్, షబాజ్ పాల్గొన్నారు.


వేం నరేందర్‌రెడ్డితో కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

తాగునీరు రోడ్డు పాలు!

రెడ్‌హిల్స్‌లో పగిలిన పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టిన అధికారులు


రోడ్డుపై పారుతున్న తాగునీరు

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లో సీవరేజ్ పైపులైన్ల మరమ్మతులు కొనసాగుతున్నాయి. అయితే శనివారం జేసీబీతో పనులు చేయిస్తుండగా మంచినీటి మెయిన్ పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా రోడ్ల మీద ఏరులై పారుతోంది. దీంతో వాటర్ వర్క్స్ అధికారులు రెడ్‌హిల్స్ సెక్షన్‌కు వచ్చే మెయిన్ తాగునీటి పైప్‌లైన్‌ను ఆసిఫ్‌నగర్ నుంచి సరఫరా కాకుండా నిలిపివేశారు. ప్రస్తుతం మరమ్మతులు చేపట్టామని రెండురోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అయితే మెయిన్ పైప్‌లైన్ నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో రెడ్‌హిల్స్ రిజర్వాయర్ ఖాళీ అయిపోయింది. ఇక్కడి నుంచే అసెంబ్లీకి కూడా మంచినీటి సరఫరా జరగాల్సి ఉంది. అయితే సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతాయి. ఆలోగా అధికారులు మరమ్మతులు పూర్తి చేస్తారా..? లేదా..? అనేదే ప్రశ్నార్థకంగా మారింది. మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఉండదని వాటర్ వర్క్స్ మేనేజర్ నదీం పేర్కొన్నారు.

నేడు సరఫరా ఉండని ప్రాంతాలు..

ఖైరతాబాద్ ఏరియాలోని రాజ్‌దూత్ హోటల్ నుంచి ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ వరకు, న్యూ సీబీఐ క్వార్టర్స్, డబుల్ బెడ్రూం, ఇందిరానగర్ మహాభారత్‌నగర్, నెహ్రూనగర్, లక్ష్మీనగర్, వెజిటెబుల్ మార్కెట్ రోడ్, చింతలబస్తీ, ఏసీ గార్డ్స్, ఎరుకుల బస్తీ, తుమ్మల బస్తీ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి


పాఠశాలను సందర్శిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెలకొంటున్న సమస్యల నేపథ్యంలో మొఘల్‌పురా కార్పొరేటర్, పలువురు అధికారులతో కలిసి తలాబ్‌కట్టాలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను శనివారం సందర్శించారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ఆయన వెట కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు, అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల చోరీ కేసులో 6 నెలల జైలు

నాంపల్లి: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడికి కోర్టు 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించింది. శేరిలింగంపల్లికి చెందిన మహ్మద్ హమీద్ కుమారుడు మహ్మద్ అస్గర్ అలియాస్ అఫ్సర్ ఇటీవల రైళ్లలో రూ.60 వేల విలువైన 5 సెల్‌ఫోన్లను దొంగలించి తప్పించుకుని తిరుగుతున్నాడు. నాంపల్లి జీఆర్పీ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో చార్జిషీట్ దాఖలు చేసి రెండో ఎంఎం రైల్వే కోర్టులో హాజరుపర్చగా జడ్జి 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చిందని నాంపల్లి జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అలాగే నిందితుడి నుంచి 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


పట్టాలు తీసుకున్న విద్యార్థులతో ప్రొఫెసర్ శ్రీరాములు తదితరులు

గన్‌ఫౌండ్రీ: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఓయూ కామర్స్ అండ్ మేనేజిమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరాములు అన్నారు. ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో అవంతి కళాశాలలకు చెందిన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని దానికి తగ్గట్టుగా విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచించారు. మాజీ మంత్రి, కళాశాల చైర్మన్ అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యతో పాటు ఉపాధి అవకాశాలు సైతం పొందేలా విద్యార్థులకు స్కిల్స్ నేర్పిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పీజీ పట్టాలు అందజేశారు. అలాగే పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో టెక్ మహేంద్ర వైస్ ప్రెసిడెంట్ మల్లాడి నాగార్జున, హెచ్‌సీయూ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ అప్పారావు, అజ్మల్ ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో అన్నదానం

నాంపల్లి: టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రిలో శనివారం రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, నేతలు ముఖీం ఖురేషి, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ


పడిపూజలో పట్నం సుబ్బారావు, రాకేశ్ ముళ్లే తదితరులు

అబిడ్స్: మహేశ్‌నగర్‌కాలనీలో ప్రముఖ సంఘ సేవకుడు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం సుబ్బారావు ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు నర్సింగ్‌రావు గురుస్వామి నార్సింగి గాన బృందం నేతృత్వంలో దీక్షాపరులు భక్తిగీతాలతో అలరించారు. కాలనీవాసులతో పాటు గుడిమల్కాపూర్ పరిసరాలకు చెందిన వందలాది మంది అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

శబరికి అయ్యప్ప స్వాముల పయనం


శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని శబరి గిరీష అయ్యప్ప సన్నిధానంకు చెందిన అయ్యప్ప స్వాములు సాకెల్లి సర్వేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం శబరికి బయలుదేరారు. హనుమాన్‌నగర్‌లోని మంగళముఖి హనుమాన్ ఆలయంలో ఇరుముడులు కట్టుకుని అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లారు.

కేశవరావుకు సన్మానం


కేశవరావును సన్మానిస్తున్న మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు కే కేశవరావును గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మమతా గుప్తా, సంతోష్‌గుప్తా శనివారం కలిశారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని వారు సత్కరించి అభినందలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ సకల కళలకు నిలయం



గన్‌ఫౌండ్రీ: రాష్ట్రం సకల కళలకు నిలయమని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కే దామోదర్ గుప్తా అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో సకల కళా వైభవం పేరిట శనివారం పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ రకాల నృత్య రూపకాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలువురు సంగీత నాట్య గురువులను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా, సాంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధి నాగేశ్వర్‌రావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్య ప్రదర్శనలను ఆదరించాలి



అబిడ్స్: కూచిపూడి నాట్య ప్రదర్శనలను ఆదరించాలని బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహనరావు పేర్కొన్నారు. అబిడ్స్ లోని తెలంగాణ సరస్వత పరిషత్ వేదికగా శ్రీకర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది చిన్నారులతో నిర్వహించిన కూచిపూడి నాట్యప్రదర్శన ఆకట్టుకుంది. వేదికపై అద్భుతంగా డ్యాన్స్ చేసిన చిన్నారులను అభినందించి సత్కరించారు.